: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified


గౌరవ సంపాదకులు
ఆచార్య కె.పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 34 | 22-05-2023 | పుటలు : 4


## ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసిన వీసీ


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు లను వీసీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు తెలియజేశారు.



## కాటన్ మహనీయుని ఆదర్శంగా తీసుకోవాలి




**15.05.23 (మీడియాసెల్)**

గోదావరి జిల్లాలను సస్యశ్యామలంగా మార్చిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులకు కాటన్ గొప్పతనాన్ని తెలియజేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. సోమవారం నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో సర్ ఆర్థర్ కాటన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై కాటన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్ కృషి ఫలితంగానే గోదావరి జిల్లాలు ధాన్యాగారంగా ప్రసిద్ధి చెందుతున్నాయని అన్నారు. గోదావరి వాసులు నేడు సుఖశాంతులతో జీవిస్తున్నారంటే ధవళేశ్వరంపై కాటన్ నిర్మించి బ్యారెజ్ కారణం అని తెలిపారు. 18 ఏళ్ళకే ఇంజనీర్ గా పని చేస్తూ విశేష సేవలందించారని, ప్రతికూల పరిస్థితులలో కూడా పట్టువదలకుండా బ్యారెజ్ నిర్మాణాన్ని చేపట్టారని చెప్పారు. నేటి తరం విద్యార్థులకు సర్ ఆర్థర్ కాటన్ వంటి మహనీయుని చరిత్రను తెలియజేయాలన్నారు. బ్యారెజ్ నిర్మాణ ప్రాతంలోని పిల్లలకు కాటన్ భార్య విద్యను నేర్పించేవారని, విద్యాపరమైన విషయాలలో అందరూ ముందుండాలని తెలియజేసారు. ఆయన పట్టుదల, సమాజం పట్ల ఆయనకున్న బాధ్యతలను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా స్ఫూర్తిని పొందుతారని అన్నారు. నాటి గోదావరి ప్రాంతాలను పీడిస్తున్న కరువు, వరదలను తన పట్టుదలతో జయించిన కాటన్ మహాశయునికి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ కాటన్ దొరను గోదావరి వాసులు దేవునిలా పూజిస్తారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పట్టుదలతో పని చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమణేశ్వరి, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.వి.పెర్సిస్, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు డా.టి.సత్యనారాయణ, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, డా.లక్ష్మీనారాయణ, డా.శ్రీనివాస్, డా.యామిని జ్యోత్స్న, కీర్తిమరీట, డి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కాటన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ పద్మరాజు

# సంపాదకీయం




## నిజమైన విద్య

విద్య వలన, శ్రద్ధ వలన కలిగే ఫలితం అత్యంత శక్తిమంతంగా ఉంటుందని అంటుంది మన భారతీయ సాహిత్యం. కళాశాలలో, విశ్వవిద్యాలయాల్లో చదువులు పూర్తి చేసుకుని బయటకు అడుగు పెడుతున్న ప్రతి విద్యార్థినీ ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్న మన సమాజం పెరుగుతున్న సమస్యలతో, ప్రభావవంతమైన చరిత్రతో, గొప్ప భవిష్యత్తుతో ఉంది. ప్రతి విద్యార్థి తనను తాను శక్తిమంతం చేసుకుంటూ, సమాజాన్ని శక్తిమంతం చేయడానికి ప్రయత్నించే దిశగా దినచర్యను తయారు చేసుకోవలసిన అవసరం ఉంది. ఆత్మవిశ్వాసం వలనా, మన దేశ వారసత్వం మీద నమ్మకం వలనా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న విజ్ఞానంతో మమేకం అవటం వలన మాత్రమే విద్యార్థులకు అటువంటి శక్తి లభిస్తుంది. నిజమైన విద్య లక్ష్యం కూడా ఇదే.

'ఎంత వరకూ జీవిస్తానో, అంతవరకూ నేర్చుకుంటూనే ఉంటానన్నారు' రామకృష్ణ పరమహంస. ఇటువంటి అభిప్రాయం విద్యార్థుల్లో నిరంతర వ్యక్తిత్వ వికాసానికి, ప్రవర్తనలో అభివృద్ధికి, జీవించటంలో మెరుగుదలకు కారణమవుతుంది. చదువులు మెదడులో కూరడానికి కాదు. మనసుకి శిక్షణ ఇవ్వటానికి. గ్రేడ్లు, ర్యాంకులతో విజయ కేతనాన్ని ఎగురవేస్తున్న చాలామందిలో సృజనాత్మకశక్తి లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.బహుశా మాస్టారు నోట్స్ లో నుండి విద్యార్థుల నోట్స్ లోకి, మొబైల్ నుండి మొబైల్ కి సమాచారాన్ని చేరవేసే ప్రక్రియ వలన ఈ ఇబ్బంది వచ్చివుండొచ్చు. ప్రాచీన భారతీయ విద్యావిధానంలోని మాస్టారి మెదడు నుండి, బుద్ధి నుండి విద్యార్థుల మెదటిలోకి,బుద్ధిలోకి ప్రవేశించే చదువులకు ప్రాధాన్యం తగ్గటం మూలాన్న అయ్యుంటుంది.

జీవితాన్ని నిర్మించే,మానవుణ్ణి నిర్మించే, ప్రవర్తనను నిర్మించే భావాల సమీకరణం మాత్రమే విద్య అంటారు వివేకానందులు. చదువులకు సంబంధించిన పుస్తకానికి గాంధీజీ ముందుమాట రాస్తూ జీవితంపట్ల తమనుతాము సన్నద్ధం చేసుకోవటానికి తోడ్పడలేనిది,దృఢమైన వ్యక్తిత్వాన్ని వ్యక్తం చేయలేనిది, సమర్పణ భావాన్ని ఇవ్వలేనిది విద్య ఎలా అవుతుంది? అని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా టాగోర్ గురుదేవుని అనురాగపూరిత వాక్యాన్ని మనం ఒకసారి స్మరించుకోవాలి. "విద్య లక్ష్యం – మనిషికి సత్య సమైక్యతను ఇవ్వటమే"

తాత్కాలికమైన భౌతిక ప్రయోజనాలు, వినోదాలు,కాలక్షేపాలు, వంటివాటిల్లో మునిగిపోకుండా ఉన్నతమైన విలువల్లోకి, సంభాషణల్లోకి,ప్రవర్తనలోకి, తమకు తాముగా, పదిమందికి ఉపయోగపడే వ్యక్తులుగా మన విద్యార్థులు తయారుకాగలిగితే, చేయగలిగితే, అటువంటి చదువుల్ని అందించగలిగితే,వారు గ్రహించగలిగితే ఈ సాంకేతిక అభివృద్ధి, సౌకర్యాల కల్పన,తపన పడుతున్న వ్యక్తుల శ్రమ, ఖర్చు,సమయం నిజమైన విద్య కోసం సద్వినియోగమవుతున్నట్లే!

# శ్రద్ధాంజలి



జేఎన్టీయూకే తొలి వైస్ ఛాన్సలర్ గా సేవలందించిన ఆచార్య అల్లం అప్పారావు ఆదివారం ఉదయం అమెరికాలోని డల్లాస్ లో మృతి చెందారు. ఆయన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి 2011 జూలై, ఆగస్టు మాసాలలో ఉపకులపతిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. అల్లం అప్పారావు సారధ్యంలో ప్రస్తుత విశ్వవిద్యాలయం ఉన్న ప్రాంగణంలో ఒక షెడ్డు వేసి నన్నయ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. వెలుగుబంద ప్రాంగణంలో నన్నయ విగ్రహాన్ని ప్రతిష్టించి తెలుగు,ఇంగ్లీషు విభాగ తరగతులను ప్రారంభించారు. వారు సేవలందించిన రెండు మాసాలు విశ్వవిద్యాలయం ప్రగతి పునాదిరాళ్లుగా అభివర్ణించవచ్చు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు.



## నమ్మకం

నమ్మకం మనిషిని నడిపించే అద్భుత సాధనం
జీవన గతిని బలోపిత చేసే ఇంధనం
గమ్యం తెలియనప్పుడు
నమ్మకమే నడిపిస్తుంది చీకటివలయంలో వెలుగులు నింపేది నమ్మకం
నమ్మకం లేకుంటే
జీవనగతి దుర్లభం
నడవడం నేర్చాక నమ్మకమే నడిపిస్తుంది
నమ్మకం ఎక్కువైతే అభిమానం పెరుగుతుంది
నమ్మకం తక్కువైతే అనుమానం పెరుగుతుంది
ఎందుకంటే ఒక అబద్ధం వలన కోల్పోయిన నమ్మకం
వేయి నిజాలు చెప్పినా రాదు
చేదు నిజాలను అధిగమించి,
తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ జీవించేలా చేస్తుంది
ఒక మనిషిని,మనిషిని కలిపే అసలు సిసలు ఇంధనం
నమ్మకమే కదా..!
అందుకే జీవితంలో ఏం కోల్పోయిన ఎదుటివారు మనమీద పెట్టుకున్న నమ్మకం మాత్రం కోల్పోకూడదు

౨- బి.ఎస్.కుమార్

## మంచిమాట

నిరుత్సాహపరచే ఆలోచనలు వస్తే వాటిని బయటకు పారద్రోలండి.మీ మనస్సును ఎల్లప్పుడూ ఉన్నతాశయాలతో నింపండి.

Always keep your mind joyful ; if melancholy thoughts come , kick them out.

**- స్వామి వివేకానంద**



# సుభాష్ చంద్రబోస్


పుస్తకం



**సుభాష్ చంద్రబోస్ జీవిత విశేషాలు గురించి ఇప్పటికే చాలా పుస్తకాలు వచ్చాయి.**
**అంతేకాకుండా ఆయన గురించి తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు.**
**అయితే ఈ పుస్తకం అందుకు భిన్నం.**

ఈ పుస్తకంలో ఆయన జీవితం,వ్యక్తిత్వం, స్వాతంత్రం కోసం ఎంతటి పోరాటం చేశారో,చాలా మంది నాయకులు ఆయనను వెనక్కిలాగిన ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఒక్కడే దేశ స్వాతంత్రం కోసం ఎంతలా తపనపడ్డారో రచయిత ఎం.వి.ఆర్ శాస్త్రి ఆధారాలతో సహా ఈ పుస్తకంలో వెల్లడించడం జరిగింది.సుభాష్ చంద్రబోస్ ఇంట్లోనే బ్రిటిష్ గూఢచారులు ఉన్నప్పటికీ, కట్టుదిట్టమైన భద్రత వలయాన్ని ఛేదించుకొని దేశం విడిచి ఎలా ఎస్కేప్ అయ్యారనేది "ది గ్రేట్ ఎస్కేప్"అనే అంశం చదువుతుంటే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. రష్యా వెళ్లడం కోసం సుమారు 50 రోజులపాటు చేసిన సుదీర్ఘ ప్రయాణం ఒక అద్భుతం. నేటి పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ కొండలలోంచి కొన్ని వందల కిలోమీటర్ల నడిచి,మూగ,చెవిటి వాడిలా నటిస్తూ ఆర్లాండో మజాటో గా పేరు మార్చుకొని రష్యా వెళ్లి అటునుండి అటు జర్మనీ చేరిన తీరును రచయిత కళ్ళకు కట్టినట్లుగా వివరించారు. అలాంటి మహనీయుడు మన దేశానికి చేసిన సేవకు ఈనాడు విలువ లేకుండా పోయింది.బోస్ దౌత్య ప్రతిభ, నిఘా సామర్థ్యం, అంతర్జాతీయ సంబంధాలు, భాష నైపుణ్యం,నాయకత్వ లక్షణాలు,దేశం కోసం ప్రాణాలర్పించే తత్వం ఇన్ని విభిన్నమైన కోణాలు ఒక మనిషిలో ఉంటాయా అని ఈ పుస్తకం చదివిన తర్వాత మనకు అనిపించక మానదు. హిట్లర్ తో భేటీ,జర్మనీ, సింగపూర్ లోని యుద్ధ ఖైదీలతో సైన్యం ఏర్పాటు, ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపన, విదేశీ గడ్డపై భారతీయ పతాకం ఎగరవేయడం వంటి అంశాలతో ఈ పుస్తకం రూపదిద్దుకుంది.దేశమంతా దేవుడిలా ఆరాధించే గాంధీతో కూడా విభేదించడం, గాంధీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండి కూడా బోస్ ఎందుకు విభేదించారనే అంశం గురించి రచయిత ఆధారాలతో సహా నిరూపించి రాయడం విశేషం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో తెగించి పోరాడాల్సిన సమయంలో జాతీయ కాంగ్రెస్ సంస్థ మౌనంగా ఉండిపోవడంతో బోస్ రక్తం ఎలా మరిగిందో 1940 మే 11న 'ఫార్వర్డ్ బ్లాక్' పత్రికలో 'వేకప్ ఇండియా' పేరుతో బోస్ రాసిన సంపాదకీయ వాక్యాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి.సుభాష్ చంద్రబోస్ తన భార్యను ఎంత గాఢంగా ప్రేమించినప్పటికీ మాతృదేశ స్వాతంత్రం కోసం తన ప్రేమ అడ్డు కాకూడదని ప్రేమని త్యాగం చేసి కర్తవ్యం నిష్ఠతో దేశం కోసం పోరాటం చేసిన యోధుడు మన నేతాజీ.ఇలా ఎన్నెన్నో త్యాగాల సమాహారంగా ఉన్న ఈ పుస్తకంలో మనకు బోస్ గురించి ఎన్నో తెలియని నిజాలని సైతం తెలుసుకుంటాము.ఆయన మరణించి చాలా సం.లు గడిచినప్పటికీ సుభాష్ చంద్రబోస్ పేరు వింటేనే మన ఒళ్ళు పులకరిస్తుంది. నిరంతరం మాతృదేశ స్వాతంత్రం కోసం తపన పడుతూ చరిత్రలో తనకంటూ ఒక పేజీని నిలుపుకున్న నేతాజీ గురించి రాయబడిన ఈ పుస్తకం అందరూ చదవాలని ఆకాంక్ష.


**- బి.సుశాంత్ కుమార్, ఎమ్మెస్సీ జువాలజీ,బి.ఎడ్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ**




# చరిత్రకెక్కని స్వాతంత్ర్య సమరయోధుడు - చంద్రయ్య దొర

## ప్రతిభావాణి

ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమే భారతదేశ స్వాతంత్ర్యం.ఎందరో తమ రక్తాన్ని ధారపోసి అలుపెరగని పోరాటం చేసి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టారు.అందులో కొందరు యోధులు గురించి మాత్రమే మనకు తెలుసు.కానీ మనకు తెలియని ఒక అద్భుత వీరుడు 'ద్వారబంధాల చంద్రయ్యదొర' గురించి రచయిత కోటిపల్లి సుబ్బారావు గారు "చరిత్రకందని స్వాతంత్ర్య సమరయోధుడు"అనే పేరుతో పుస్తక రూపంలో వెలుగులోకి తెచ్చారు. అల్లూరి కంటే ముందు తెల్ల దొరల యొక్క నిరంకుశత్వం, కుట్ర,స్వార్ధపూరితమైన ఆలోచనల నుండి భరతమాతకు విముక్తి కలిగించాలని గట్టి పోరాటమే చేశారు.కానీ దురదృష్టం కొద్దీ ఈయన చరిత్ర ఇప్పటికే బయటికి రాలేదు.




విజయనగరం జిల్లాలోని బొబ్బిలిలో 1860 సెప్టెంబర్ 10వ తేదీన జన్మించిన చంద్రయ్యదొర అల్లూరి సీతారామరాజు యొక్క మన్యం విప్లవం కంటే 40 ఏళ్ల ముందే రంప విప్లవాన్ని నడిపించారు.బ్రిటీష్ పాలకులు స్థానిక సంస్థానాదీశులతో కలిసి సామాన్య ప్రజానీకానికి పెడుతున్న హింసను సహించలేక తిరుగుబాటు ప్రకటించారు.

బడుగు,బలహీన,గిరిజన వెనుకబడిన వర్గాలు, వ్యవసాయ కూలీలు, యువకులను కూడగట్టుకొని నెల్లిమడి గ్రామానికి 50 కిలోమీటర్లు దూరంలో బురద కోట స్థావరాన్ని నిర్మించుకొని ఆంగ్ల సామ్రాజ్యాన్ని గడగడలాడించారు.ఈయన ప్రారంభించిన ఈ రంప విప్లవపోరాటం అటు ఖమ్మం, తూర్పు,పశ్చిమ విశాఖ జిల్లాలతో పాటు, మధ్యప్రదేశ్,ఒరిస్సా సరిహద్దుల వరకు విస్తరించి, ఈ పోరాటంలో విజయం సాధించి తెల్లదొరల కంట్లో నలుసుగా మారారు.

కారం తమ్మన్నదొర, పులిచింత సాంబయ్య, అంబులరెడ్డి వంటి యోధులతో చేయికలిపి ప్రజా ప్రతిఘటనను తీసుకొచ్చారు.1879 రంపచోడవరంలో ప్రారంభమైన రంప విప్లవం భద్రాచలం,రేకపల్లి, కొయ్యూరు,గోల్కొండ ప్రాంతాలకు విస్తరించింది.


బ్రిటిష్ వారు డబ్బు, పరపతి,సంస్థానాదీశ పదవి ఆశ చూపిన తిరస్కరించి పీడిత ప్రజల కోసం గట్టి పోరాటం చేశారు.

అయితే ఇంతటి మహెూద్యమాన్ని నడిపించిన చంద్రయ్యదొర యొక్క చరిత్ర ఇంతవరకు వెలుగులోకి రాకపోవడం నిజంగా దురదృష్టకరం.ఈయన గురించి పరిశోధించి ఈయన జీవితచరిత్రను పుస్తక రూపంలో వెలుగులోకి తెచ్చిన రచయిత కోటిపల్లి సుబ్బారావు గారికి నిజంగా అభినందనలు.భారతీయ తపాలశాఖ వారు కూడా ఆయన యొక్క కృషికి గుర్తింపుగా తపాలాబిళ్ళను తీసుకురావడం జరిగింది.ఆలస్యమైనా ఒక యోధుడి పరాక్రమం 142 సంవత్సరాల తర్వాత వెలుగులోకి రావడం నిజంగా సంతోషించదగిన విషయం.

**- బి.ఎస్.కుమార్,నన్నయ పూర్వ విద్యార్థి**

# వీసీ పద్మరాజుకు ప్రముఖుల శుభాకాంక్షలు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన వీసీ ఆచార్య కె పద్మరాజు ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖులు.


ఎస్.వి.సత్యనారాయణ, రిటైర్డ్ ఎస్.బి.ఐ ఛీఫ్ మేనేజర్


డా.చినమిల్లి సత్యనారాయణ రావు, కరస్పాండెంట్,శ్రీ వై.ఎన్.కళాశాల,నర్సాపురం



ఐ.గంగాధర్, అధ్యాపక బృందం వి.ఎస్.ఎం.కాలేజ్, రామచంద్రపురం,



డా.పి.సుబ్బరాజు, డైరెక్టర్ గైట్ విద్యాసంస్థలు


గార్డ్స్ ఫర్ ఆర్.టి.ఐ బృందం - వరద నాగేశ్వరరావు, ఆకుల విజయభారతి, డా.పి.వి.సంజీవరావు సభ్యులు


ఆచార్య జె.సునీత, ఈసీ మెంబర్


డాక్టర్ చప్పిడి కృష్ణ, ఆర్. జె. డిప్రిన్సిపాల్ ఆర్ట్స్ కాలేజ్, రాజమండ్రి


కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం


యూనివర్సిటీ ఫ్యాకల్టీ అసోసియేషన్


యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in